30032025-MAI-06_Layout 1 3/30/2025 1:03 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

వి.ప్రకాష్

వారికి తెలిసి కొంత, తెల్వక అంత

మార్చి 26న అసెంబ్లీలో సాగునీటి శాఖ పద్దులపై చర్చ సందర్భంగా తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ చెప్పిన అంశం మీద మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మధ్య వాదోపవాదాలు చెలరేగిన విషయం తెలిసిందే. ఉత్తమ్ కుమార్‌రెడ్డి 165 టీఎంసీల నీరు ఉందని సీడబ్ల్యూసీ చెప్పిందని, భవిష్యత్తులో 165 టీఎంసీలు లభ్యం కావని సీడబ్ల్యూసీ చెప్పిందని హరీశ్‌రావు వాదించారు. ఆ లేఖలోని వాక్యాలను చదివి వినిపించడానికి హరీశ్‌రావు ప్రయత్నం చేసినా అధికారపక్షం ఆయనకు అవకాశం ఇవ్వకుండా అడ్డుపడింది. అయితే గతంలో ఈ అంశంపై హరీశ్‌రావు సీడబ్ల్యూసీ ప్రాణహిత చేవెళ్ల చీఫ్ ఇంజినీర్‌కు 2015 మార్చి 4న రాసిన లేఖలో తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతపై వారు వెలిబుచ్చిన కామెంట్స్ చదివి వినిపించారు. మార్చ్ 29న శ్రీధర్‌రావు దేశ్‌పాండే రాసిన 'తుమ్మిడిహట్టి- నీటిలభ్యత.. నిజానిజాలు' శీర్షికతో రాసిన వ్యాసంలో ఈ వాక్యాలను యథాతథంగా ఉల్లేఖించారు. అందువల్ల ఆ అంశం జోలికి పోదలుచుకోలేదు.

అయితే ఆ వాదోపవాదాల్లో సందెట్లో సడేమియా లాగా సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ ఈ చర్చలో దూరి అధికారపక్షం వైపు నిలబడి 'తుమ్మిడిహట్టి వద్ద నీరు లేదని సీడబ్ల్యూసీ చెప్పినట్టు నిరూపిస్తే ముక్కు నేలకు రాసుకుంటానని, గుండు కొట్టించుకుంటానని' శపథాలు చేయడం మాత్రం అందరినీ విస్మయానికి గురి చేసింది. తుమ్మిడిహట్టి బ్యారేజీ కట్టకుండా ప్రాజెక్టును తమ ప్రాంతం నుంచి మేడిగడ్డకు లాక్కుపోయారని ఆయన ఆవేదనలో నుంచే ఈ ఆవేశం పొడుచుకువచ్చిందనుకోవచ్చు. వాస్తవాలు తెలిసినట్టయితే ఆయన అంత ఆవేశానికి లోనయ్యేవాడు కాదని, ప్రభుత్వ పక్షం వహించేవాడు కాదని నా అభిప్రాయం. అయితే పాల్వాయి హరీశ్ గుర్తించవలసిన అంశాలు ఇవీ...

తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ నిర్మించకుండా నిర్లక్ష్యం చేసిందెవరు? 2004-14 వరకు పదేండ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కాదా? 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించకుండానే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పనులను 28 ప్యాకేజీలుగా విభజించి అన్ని ప్యాకేజీ పనులకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వం. అందులో తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణం పనులకూ ప్యాకేజీ 3 కింద టెండర్లు పిలువడం జరిగింది. హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపనీ (హెచ్‌సీసీ) ఈ టెండర్లను దక్కించుకున్నది. పనులు మాత్రం మొదలుకాలేదు. మహారాష్ట్రతో ఒప్పందం లేకుండా తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించలేమని ప్రభుత్వానికి తెలియని విషయం కాదు. సంప్రదింపులు జరిపి 152 మీటర్ల ఎత్తు వరకు బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించడంలో ఉమ్మడి ఏపీ రాష్ట్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించింది. జలయజ్ఞంలో ప్రారంభించిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచే పనిలో, తెలుగు గంగ, శ్రీశైలం కుడికాలువ, హంద్రీనీవా, వెలిగొండ, తదితర రాయలసీమ ప్రాజెక్టులను, పులిచింతల ప్రాజెక్టును పూర్తిచేయడంలో మొత్తం ప్రభుత్వ యంత్రాంగం మునిగిపోయి ఉంది.

వారికి తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించాలంటే మహారాష్ట్రతో ఒప్పందం చేసుకోవాలని సోయి ఉండిందా? అధికారుల స్థాయిలో కొన్ని ప్రయత్నాలు జరిగి ఉంటాయి. కానీ, ఆ సమస్య రాజకీయ సంప్రదింపులతో తప్ప అధికారుల స్థాయిలో చర్చల ద్వారా పరిష్కారమయ్యేది కాదు. అయినా కూడా ఈ దిశగా ప్రభుత్వ పెద్దలు దృష్టిపెట్టనే లేదు. దశాబ్దం గడిచినా బ్యారేజీ పనులు మొదలుకాలేదు.

2014లో తెలంగాణ ఏర్పాటు తర్వాతనే కేసీఆర్ ప్రభుత్వం సంప్రదింపులు మొదలుపెట్టింది. 152 మీటర్ల ఎత్తువరకు బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించడానికి నాటి సాగునీటి మంత్రి హరీశ్‌రావు, సీఎం కేసీఆర్

ఎంత ప్రయత్నించినా కొన్ని నెలలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ తమ మొండివైఖరిని వీడలేదు. 4 మీటర్ల ఎత్తు తగ్గించాలని వారు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. 2004-14 దశాబ్దం ఎంత అనుకూలమైన కాలం! కేంద్రంలో కాంగ్రెస్, మహారాష్ట్రలో కాంగ్రెస్, ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నకాలం. సోనియా గాంధీ తలచుకుంటే మహారాష్ట్రను ఈ విషయంలో ఒప్పించగలిగేదే. కానీ, ఆమె సహాయం తీసుకోవాలన్న సోయి ఉమ్మడి ప్రభుత్వానికి ఉంటే కదా! వారికి ప్రాణహిత చేవెళ్ల ఒక ఎన్నికల ప్రాజెక్టు. తెలంగాణ ఉద్యమాన్ని నీరుగార్చడానికి ఉద్దేశించిన ప్రాజెక్టే తప్ప నీరు పారిచ్చే లక్ష్యంతో తలపోసిన ప్రాజెక్టు కాదు. అందుకే, ఆ అనుకూల వాతావరణాన్ని కూడా వినియోగించుకోలేక వృథా చేశారు. కేసీఆర్ ప్రభుత్వం మహారాష్ట్రతో చర్చలతో కాలయాపన చేయదలచుకోలేదు. గోదావరి జలాలను తెలంగాణ పంట పొలాలకు పారిచ్చి తెలంగాణలో సాగునీటి సంక్షోభాన్ని నివారించి రైతాంగానికి సాగునీటి భరోసాను ఇవ్వాలనుకున్నది. కాబట్టే, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును రీ ఇంజినీరింగ్ చేసి నాలుగేండ్లలోనే బృహత్తర కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి కొత్త ఆయకట్టు, స్థిరీకరణ ఆయకట్టు కలిపితే సుమారు 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దశాబ్ద కాలంలో మహారాష్ట్రను ఒప్పించి తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ పనులు ప్రారంభించి 50 శాతమో, 60 శాతమో పూర్తిచేసి ఉంటే కేసీఆర్ ప్రభుత్వానికి రీ ఇంజినీరింగ్ చేసే అగత్యం ఏర్పడి ఉండేది కాదు. కేసీఆర్ ప్రభుత్వానికి రీ ఇంజినీరింగ్ చేసే అగత్యం కల్పించింది ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అన్న సంగతి పాల్వాయి హరీష్ గుర్తించి ఉంటే ఆయన ఆ రకంగా కేసీఆర్ ప్రభుత్వంపై విరుచుకు పడి ఉండేవాడు కాదేమో!

2013లో అప్పటి కాంగ్రెస్ సీఎం పృథ్వీరాజ్ చవాన్ తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసినా, నిమ్మకు నీరెత్తినట్టు కూర్చొని కాలక్షేపం చేసినా నాటి ప్రభుత్వ పెద్దలు ఇవ్వాళ కేసీఆర్ ప్రభుత్వం రీ ఇంజినీరింగ్ పేరు మీద గ్రావిటీ ప్రాజెక్టును వదిలేసి భారీ ఎత్తిపోతలను చేపట్టిందని విమర్శలు చేయడం సమంజసమా?

పాల్వాయి గత ప్రభుత్వంపై విరుచుకుపడటం కంటే ఇప్పటి ప్రభుత్వాన్ని అడుగవలసిన ప్రశ్నలు.. ఉమ్మడి ఏపీలో ఎనిమిదేండ్లు తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణం ఒక్క అంగుళం కూడా ముందుకు సాగలేదెందుకు? కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే, మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వమే, ఇక్కడా కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్న అనుకూల కాలంలోనూ 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వద్ద తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాధినేతలు ఎందుకు ఒప్పించలేకపోయారు? 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌తో కాలువల డిజైన్లు పూర్తిచేసి టెండర్లు పిలిచి గుత్తేదారులకు పనులు అప్పగించిన ప్రభుత్వ పెద్దలు తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎఫ్ఆర్ఎల్‌పై మహారాష్ట్రను ఒప్పించాల్సిన అవసరాన్ని ఎందుకు నిర్లక్ష్యం చేశారు? 2013లో అప్పటి కాంగ్రెస్ సీఎం పృథ్వీరాజ్ చవాన్ తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసిన, నిమ్మకు నీరెత్తినట్టు కూర్చొని కాలక్షేపం చేసినా నాటి ప్రభుత్వ పెద్దలు ఇవ్వాళ కేసీఆర్ ప్రభుత్వం రీ ఇంజినీరింగ్ పేరు మీద గ్రావిటీ ప్రాజెక్టును వదిలేసి భారీ ఎత్తిపోతలను చేపట్టిందని విమర్శలు చేయడం సమంజసమా? తుమ్మిడిహట్టి బ్యారేజీని నిర్మించి తీరుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ పెద్దలు గడిచిన 15 నెలల్లో చేసిందేమిటి? హరీష్ సంధించాల్సిన ప్రశ్నలు ఇవి కదా! పాల్వాయి హరీష్ కొంత తెలిసి, ఎక్కువ తెలియక గత ప్రభుత్వం మీద విరుచుకుపడటం అందరినీ విస్మయానికి గురిచేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కలిసి చెట్టాపట్టాలు వేసుకొని పని చేస్తున్నాయని చెప్పడానికి పాల్వాయి హరీష్ 'సందట్లో సడేమియా' ఉదంతం ఒక సాక్ష్యంగా నిలిచింది.

2014-23 వరకు పదేండ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం 148 మీటర్ల ఎత్తు నిర్మించడానికి మహారాష్ట్రతో ఒప్పందం చేసుకున్నప్పటికీ తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎందుకు నిర్మించలేకపోయిందన్న ప్రశ్న ఉంది. 148 మీటర్ల ఎత్తు వద్ద కూడా తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించడానికి సాంకేతిక సమస్యలతో పాటు, పెరిగే ఖర్చు, చాప్రాల్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం అడ్డంకులుగా ఉన్నాయి.

15 నెలలు గడిచినా తుమ్మిడిహట్టి బ్యారేజీ కట్టితీరుతామని బీరాలు పలుకుతున్న రేవంత్ ప్రభుత్వం అడుగు ముందుకు వేయలేకపోవడానికి కారణాలివే. ఏ ఎత్తుకు బ్యారేజీ కడతామన్న అంశంపై కూడా వారికి స్పష్టత ఉన్నట్టు లేదు. 152 మీటర్ల ఎత్తుకు కట్టాలంటే మహారాష్ట్రతో ఒప్పందం తప్పనిసరి. ఇప్పుడు అక్కడ అధికారంలో ఉన్నది దేవేంద్ర ఫడ్నవీస్ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం. గతంలోనే ఒప్పుకోని ఫడ్నవీస్ ఇప్పుడు ఒప్పుకుంటాడా? 148 మీటర్ల వద్ద తుమ్మిడిహట్టి బ్యారేజీలో ఉండే స్టోరేజీ 1.5 టీఎంసీలు మాత్రమే. ఉమ్మడి రాష్ట్రంలోనే తవ్విన కాలువలోకి నీరు గ్రావిటీతో తరలించడం కుదరదు. మరొక చిన్న లిఫ్ట్ పెట్టి నీటిని ఎత్తిపోయవలసి ఉంటుంది. బ్యారేజీ నిర్మాణ స్థలం వార్ధా, వైన్ గంగ సంగమం కాబట్టి రెండు నదులకు అడ్డంగా సుమారు 6 కిలో మీటర్ల పొడవైన బ్యారేజీ సుమారు 110 గేట్లతో నిర్మించాలి. ఇప్పటి ధరలతో లెక్క వేస్తే భూ సేకరణ సహా బ్యారేజీ ఖర్చు సుమారు 3 వేల కోట్లు. బ్యారేజీని నదీ ప్రవాహానికి 40 డిగ్రీల కోణంలో(Skew) నిర్మించాలి. ఇటువంటి బ్యారేజీలు మన దేశంలో కానీ, ప్రపంచంలో మరెక్కడా లేవు. ఇవన్నీ మధింపు వేసుకొనే కేసీఆర్ ప్రభుత్వం వార్ధా నదిపై బ్యారేజీని ప్రతిపాదించింది. పైన పేర్కొన్న అన్ని సమస్యలు వార్ధా బ్యారేజీలో సమసిపోతాయి. కేసీఆర్ ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వార్ధా ప్రాజెక్టు పేరుతో రూ.4,550 కోట్లతో డీపీఆర్ తయారుచేయించి కేంద్ర జల సంఘానికి పంపించింది. అనుమతుల ప్రక్రియ కొనసాగుతుండగానే అధికార మార్పిడి తర్వాత సీడబ్ల్యూసీ డీపీఆర్‌ను వాపస్ చేసింది. మార్చి 26న కూడా అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించి తీరుతామని ప్రకటించారు. అంతకు కొన్ని రోజుల ముందు మార్చి 17న కౌన్సిల్‌లో కోదండరాం అడిగిన ప్రశ్నకు ఇతర ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నామని రాత పూర్వకంగా జవాబిచ్చారు. మరి వారేం చేస్తారో కాలమే నిర్ణయిస్తుంది.

(వ్యాసకర్త: తెలంగాణ వాటర్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్)

టీచర్ల సెలవులు.. నిజాలు

మిత్రులందరికీ నమస్తే,
ఉపాధ్యాయులకు సెలవులు ఎక్కువ అని గతంలో ఒకసారి సీఎం నిందలు మోపిన సందర్భంలో 10-02-2021వ తేదీన నేను ఇచ్చిన వివరణ మళ్లీ ఒకసారి మనందరి కోసం..

ఉపాధ్యాయులు ఏడాది కాలంలో 220 రోజులు మాత్రమే పనిచేస్తారు కాబట్టి, వారికి వేతన సవరణ అవసరమా? ఉద్యోగ విరమణ వయసు పెంపు అవసరమా? అంటూ ఈరోజు కొన్ని పత్రికల్లో ఉపాధ్యాయుల మనోభావాలను, ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే విధంగా కథనాలు రావడం జరిగింది. ఉద్యోగుల నుంచి ఉపాధ్యాయులను వేరు చేసి పనిచేయని వారి కింద చూపించే ప్రయత్నం జరిగింది.

ఒక నిమిషం ఉపాధ్యాయుల పనిదినాలను పక్కనపెట్టి, అసలు ఉద్యోగులు ఎన్నిరోజులు పని చేస్తున్నారన్న విషయాన్ని కూడా ఒకసారి గమనిద్దాం.

1. ఒక సంవత్సరానికి 365 రోజులుంటాయి.
2. ఈ 2021వ సంవత్సరంలో ప్రభుత్వం ఇచ్చినటువంటి ఉత్తర్వుల ప్రకారం.. పండుగల సందర్భంలో ఇచ్చిన సాధారణ సెలవులు (ఆదివారాలు కాకుండా) 26.
3. అంతేకాకుండా ప్రభుత్వం 25 రోజులు ఆప్షనల్ హాలిడేస్‌గా ప్రకటించింది. ఇందులో నుంచి ఏవైనా 5 రోజులను ఉద్యోగులు సెలవు కింద వాడుకుంటారు.
4. ఒక సంవత్సరంలో కనీసంగా 52 ఆదివారాలు వస్తాయి. ఇవి కూడా ఉద్యోగులకు సెలవులే.
5. ప్రతి నెల రెండవ శనివారం సెలవు. జనవరి 1వ తేదీ సెలవుకు బదులుగా పనిచేసే ఫిబ్రవరి రెండవ శనివారంను వదిలిపెడితే మిగతా 11 నెలలకు 11 రోజులు ఉద్యోగులకు సెలవు.
6. ఒక సంవత్సర కాలం విధులు నిర్వహిస్తే ఉపాధ్యాయులకు 6 రోజులు సంపాదిత సెలవులు ఉద్యోగులకు 30 రోజులు సంపాదిత సెలవులు మంజూరు చేస్తారు. అంటే ఉపాధ్యాయుల కంటే 24 రోజుల సంపాదిత సెలవు ఉద్యోగులకు అదనంగా ఇవ్వబడుతుంది.
7. **ఒకసారి ఉద్యోగుల మొత్తం సెలవులను లెక్కించి చూద్దాం.**
   - 26 రోజులు- పండుగ సెలవులు
   - 5 రోజులు- ఐచ్ఛిక సెలవులు
   - 52 రోజులు- ఆదివారం సెలవులు
   - 11 రోజులు- రెండవ శనివారం సెలవులు
   - 24 రోజులు- సంపాదిత సెలవులు
   - 118 రోజులు- మొత్తం సెలవులు
   - 365-118= 247 రోజులు మాత్రమే ఉద్యోగుల పని దినాలు.
   - ఉపాధ్యాయుల పనిదినాలు కనీసం 220 రోజులు.
   - 247 ఉద్యోగుల పనిదినాలు-220 ఉపాధ్యాయుల పనిదినాలు= 27 రోజులు.
   - **అంటే 27 రోజులు మాత్రమే ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పనిదినాలలో వ్యత్యాసం ఉన్నది.**
8. **ఒకసారి పనిగంటలు కూడా లెక్కిద్దాం.**
   - పాఠశాలల (High School) పని వేళలు.. ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:45 వరకు. అంటే ఒకరోజు 7.15 (ఏడు గంటల పదిహేను నిమిషాలు) సమయం ఉపాధ్యాయులు పనిచేస్తారు.
   - కార్యాలయాల పనివేళలు... ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ఆరంభమై సాయంత్రం 5 గంటలకు ముగుస్తాయి. అంటే ఒకరోజు 6.30 (ఆరున్నర గంటల) కాలం ఉద్యోగులు పనిచేస్తారు. ప్రతిరోజు ఉద్యోగుల కంటే, ఉపాధ్యాయులు 45 నిమిషాలు ఎక్కువ పనిచేస్తారు. అలా ఉపాధ్యాయులు మొత్తం రెండు వందల ఇరవై రోజుల్లో పని చేసే కాలం 165 గంటలు. ఈ 165 గంటలను రోజుల్లో చూసినట్లయితే ఉద్యోగులు 25 రోజులు పనిచేసే కాలానికి సమానం.
9. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పనిచేసే కాలానికి ఈ రోజుల్లో లెక్క చూసినట్లయితే వ్యత్యాసం 27 రోజులు. పనిచేసే కాలాన్ని కూడా లెక్కలోకి తీసుకుంటే ఆ వ్యత్యాసం 27-25= 2 రోజులు మాత్రమే.
10. ఒక సంవత్సర కాలంలో ఉన్న 2 రోజుల పనిదినాల వ్యత్యాసానికి ఉపాధ్యాయులను అంత కించపరచడం భావ్యం కాదు.
11. ఆదివారాలు, పండుగలు ఉపాధ్యాయులు కూడా సెలవే కదా అని ఆలోచన ఎవరికైనా వచ్చిందేమో, ఏ సెలవులతో నిమిత్తం లేకుండా ఒక సంవత్సరంలో పాఠశాల కనీసంగా 220 రోజులు పనిచేస్తుంది.
12. ఉపాధ్యాయులు, ఉద్యోగుల మధ్య ఈ రకమైన లెక్కలు వ్యవస్థకు మంచి చేయవు. అందరూ ప్రభుత్వ సేవకులే. కేవలం వాస్తవం తెలియాలనే ఉద్దేశంతోనే ఈ వివరణ తప్ప ఎవరినీ కించపరిచే ఉద్దేశం కాదు.
13. ఇంకా సంక్రాంతి, దసరా సెలవులు, ఎండకాలం సెలవులు గురించి ఒక మాట. అవన్నీ పిల్లల కోసం ఇచ్చిన సెలవులే కానీ, ఉపాధ్యాయుల కోసం ఇచ్చిన సెలవులు కాదు. ఏ సెలవుల్లోనైనా ప్రభుత్వం ట్రైనింగ్ ప్రోగ్రాంలు నిర్వహించినా, సర్వేలు చేయమన్నా, రకరకాల పరీక్షల విధులు నిర్వహించమన్నా, ఎలక్షన్ విధులు నిర్వహించమన్నా కూడా ఉపాధ్యాయులు ఎప్పుడైనా మనస్ఫూర్తిగా, ఫలవంతంగా విధులు నిర్వహించి ప్రభుత్వ ప్రతీ కార్యక్రమాన్ని జయప్రదం చేసినవారే. ఒక్కసారి మనసుతో ఆలోచించవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ...

(పేరు చెప్పడానికి ఇష్టపడని ఒక మహిళా ఉపాధ్యాయురాలు 'నమస్తే తెలంగాణ'కు పంపిన లేఖ)

ఓటేసిన పాపానికి కాటేసే కాలం

ఎటువంటి ఘడియన తెలంగాణకు ఓట్లొచ్చినయో గాని..అర్ధాష్టమ దుర్దశ మోపయ్యింది. శని దైత్యుడు తన జన్మరాశి నుంచి బయటికొచ్చి మన నెత్తి మీద కూసున్నడు. దరిద్రం దాపురిస్తే మేలు కీడు తలపోతల విచక్షణ మందగిస్తుందట. అలివిగాని ఆశలు వెంటాడంగ ఎండమావిల వెంట పరుగులు పెడతారట. ఎన్నికల నాట మన మానసిక పరిస్థితి ఇదే! రూ.లక్ష కట్నం.. తులం బంగారం.. రూ.4 వేల పింఛన్ హామీల వెంట ఉరుకులు పెట్టినం. ఈ పున్నామ నరకం మనకొద్దని జనహితం కోరి జాతిపిత కేసీఆర్ గొంతు చించుకున్న మాటలు మనకు రుచించ లేదు.

వర్ధెల్లి వెంకటేశ్వర్లు

నాటి ఎన్నికల్లో కేసీఆర్ చెప్పిన మాటలు మరొక్కసారి గుర్తుచేసుకుందాం. 'మోసపోతే గోసపడుతం.. బతుకులు ఆగమైతయి.. మనం చెదిరిపోయిన నా డు మళ్లీ పాత తెలంగాణ వస్తది. ఒక్కసారి దెబ్బతింటే..! ఉన్న కూర్పు చెడిపోతే..! తెలంగాణ సమాజానికి మంచిది కాదు..తెలంగాణ తెచ్చినవాళ్లుగా చెప్పటం మా బాధ్యత.' అని అచ్చంపేట సభలో చెప్పిండు. అసుంటపోయి పాలమూరు సభల చెప్పిండు. అదే మాట సూర్యాపేట వచ్చి చెప్పిండు. కానీ మన చెవికెక్కలేదు. సారు మంచోడే అనుకుంటనే.. ఒకరిద్దరు దారితప్పిన ఎమ్మెల్యేలను తల్సుకుంట పాడి బర్రె తీరు సారును కాదనుకొని పోయి కంపల పడితే ఇవ్వాళ్టికి లేపి నిలబెట్టే దిక్కు లేదు.

అచ్చంగా ఆరోజు సారు చెప్పినట్టే ఈ రోజున ఆగం పాలైతున్నం. ఏం గ్రహచారం ఇది. చావు బొబ్బలతోనే మళ్లీ పల్లెలు తెల్లారుతున్నయి. సోమవారం దినపొద్దు సిరిసిల్ల జిల్లా చిప్పలపల్లి రైతు పరశురాములు ఊరు ముందరి పెద్దమ్మ తల్లి గుడి గంటకు పీనుగై వేలాడుతూ కనిపించిన వికల, విషాద శోక దృశ్యం కడుపుల పేగులను మెలిపెట్టింది. ఎవడు మోసుకొచ్చిన పాపం ఇది. కాంగ్రెస్ పాలన వచ్చిన నాటినుంచి ఈ రోజు వరకు తెలంగాణలో 465 మంది రైతుల అసహజ మరణాలు జరిగాయి. ఇటువంటి అనుభవాలు తెలంగాణకు కొత్త కాదు. 12 ఏండ్ల కింది ఉమ్మడి రాష్ట్రంలో ఇంతకు మించిన నరకపు సంవేదన తెలంగాణది. నీళ్లింకిన బోర్లను చూసి కన్నీళ్లతోనే కాలమెల్లదీసిన అనుభవం తెలంగాణది. చెరువులు ఎండిపోయి, బావుల్లో నీటి ఊట రాక, పొట్టకొచ్చిన చేను వట్టిపోతుంటే.. ఇగో..! ఈ మధ్యకాలంలో నీటి చెమ్మ కోసం నిర్మల్ జిల్లా నీలాయిపేట రైతు రాజన్నతట్టతోని వరి పైరుకు నీళ్లు చల్లుతూ పంటను కాపాడుకోవటానికి తండ్లాడుతున్న దృశ్యం ప్రతి పల్లెలో ఉండేది. అయినా పంట చేతికి అందక గుండెలు బాదుకుంటూ పంట సేండ్లనే పాణం ఇడిసిన చరిత్ర తెలంగాణది. పొద్దంత కాయ కష్టం చేసి పొద్దుగూకి ఇంటికొచ్చి అడ్డమొరిగితే.. కన్ను అంటుకునే లోపు కరెంటు పోయి.. దోమలు ఒంట్లె నెత్తురు పీలుస్తుంటే ఆ బాధను కనురెప్ప మాటునే దాచుకొని కునుకు తీసిన బండ బతుకు తెలంగాణ పల్లెలది. తెల్లారకముందే కరెంటోళ్లు ఇండ్లళ్ల చొరబడి కరెంటు బిల్లు కింద ఆలి మెడ మీది పుస్తెలు గుంజుకపోతుంటే గుండెలు అవిసేలా ఏడ్చి ఏడ్చి ఎక్కిళ్లు పట్టిన గతం తెలంగాణది.

ఈ కష్టాలు, కన్నీళ్లు,చావులు వద్దనే కదా తెలంగాణ కోసం బాపు తండ్లాడింది. కేసీఆరే కొలువు కెక్కి గోదావరి మీద కాళేశ్వరం కట్టకడితే మా ఊరు సూర్యాపేట జిల్లా కర్విరాల కొత్తగూడెంల కొత్త చెరువు మత్తడి దుంకింది. తెలంగాణ బంగారం పల్లెం పట్టుకొని రాలేదు. 5000 మెగావాట్ల విద్యుత్ సంక్షోభాన్ని మూట గట్టుకొని వచ్చింది. కేసీఆర్ పనిగట్టుకొని ఛత్తీస్‌గఢ్ పోయి ఆ రాష్ట్ర అప్పటి ముఖ్యమంత్రి రమణ్ సింగ్‌ను బతిమిలాడితే..చిమ్మచీకట్లను చీల్చుకుంటూ సరి కొత్త వెలుగులు రాష్ట్రంలోకి చొచ్చుకువచ్చాయి. రూ.3.90కే యూనిట్ చొప్పున కరెంటు తీసుకొస్తే వ్యవసాయానికి 24 గంటల నిరంతర నాణ్యమైన విద్యుత్తు అందింది. దానికి రైతుబంధు తోడైయింది. రూ.1.64కోట్లు ఖర్చుచేస్తే కాళేశ్వరం, కొండపోచమ్మ, రంగనాయకసాగర్, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులు మోత మోగుకుంటూ జలపాతాలను తలిపించినయి. 97.48 లక్షల ఎకరాలకు సాగు నీళ్లు అందినయి. సారు కోటి ఎకరాల మాగాణి అనే చెప్పారు కానీ ఆయన కొలువు దిగే నాటికి 2.2 కోట్ల ఎకరాల సాగు వినీర్ణం రైతుల చేతిలో పెట్టారు. (2024 ఆర్‌బీఐ నివేదిక ప్రకారం) కాల గమనంలో పదేండ్లు గిర్రున తిరిగినయి. కాలంతో పని లేకుండా పంటలు చేతికందినయి. దండుగ అనుకున్న వ్యవసాయం జీవనోపాధి నుంచి వాణిజ్య స్థాయికి ఎదిగింది. సాలుసరి దిగుబడి 4.65 కోట్ల టన్నులు వచ్చింది. అప్పులు మొగ్గినయి. రైతు ఆత్మహత్యలు ఆగినయి. పల్లె లోగిళ్లు పెండ్లి, పేరంటాళ్లు, జాతర్లు, జాజిరి పాటలతో సాంస్కృతిక పునర్జీవనం పోసుకున్నది. పోరల చదువులకు ఎల్లుబాటైం ది. రైతులు, రైతు కూలీల మొఖం జరంత తెల్లబడ్డది. కానీ కష్టపడి తెలంగాణ రూపు రేఖలు దిద్దిన సారు మొఖమే మన కంటికి మసకబారిం ది. ఎవరిని పలుకరించినా పదేండ్లు అవకాశం ఇచ్చినం. కొత్తోళ్లను కూసోబెడుదామన్న మాటే గానీ, మంచి చెడుల యోచనే లేకపాయే. పగ బట్టినట్టు పట్టుబట్టి కేసీఆర్‌ను ఓడించినం. ఇప్పు డేం మూటగట్టుకున్నం? సారుకు మనం అవకాశం ఇచ్చినమా?మనకు సారు అవకాశాలు కల్పించిండా? ఆత్మ యోచన చేసుకోవాలే. పేద కొంపల మీదికి సర్కారు వదిలిన హైడ్రా భూతం అర్ధరాత్రి వేళ ఆపదొచ్చినట్టు వస్తున్నది. సర్కారు బుల్డోజర్లు జనం మీద పడుతుంటే పేద మధ్య తరగతి కుటుంబాలు 'నా ఇళ్లు కూలిపోతంది.. కేసీఆరన్నా రాయే' అని గుండెలు బాదుకుంటున్నయి. రియల్ ఎస్టేట్ ఉపాధి పోయింది.కార్మిక జీవనం ఆగింది. పట్టణం సంగతి అట్లుంటే.. ఇక పల్లె జీవనం మరీ అధ్వాన్నం. కాళేశ్వరంను ఎండబెట్టి పల్లె సాగుబాటును పండబెట్టిండ్రు. రంగనాయకసాగర్, కొండ పోచమ్మ, గడ్డెన్నవాగు, చలివాగు, నాగార్జునసాగర్, జూరాల ఇలా ప్రతి చోటా ప్రాజెక్టుల కింద వరి సాగు తడి తప్పింది. 'నిలబడ్డకాన్నుంచే జారిపోతన్నం సారూ కేసీఆర్ చెయ్యందుకొని పైకి గుంజు' అని రైతాంగం దిక్కులు చూస్తున్నది.

గాయపడ్డ బిడ్డ అమ్మా అనటం ఎంత ప్రాకృతికమో..! తెలంగాణాలో దెబ్బతిన్న తనువులు బాపూ అని పలవరించటం అంతే సహజం. మనకు కష్టం వస్తే బాపు బరిగీసి నిలబడాలే. కానీ ఆయన మీద జరుగుతున్న కుట్రలు మాత్రం మనకు పట్టవు. సారు కరెంటు తెస్తే బావి మోటరు పొద్దంత పొసింది. ఇప్పుడా హరిత కాంతికి అవినీతి ఆపాదిస్తున్నరు. కరెంటు కొనుగోళ్ల మీద కమిషన్ వేసి దోషిగా నిలబెట్టే కుతంత్రాలు చేస్తున్నరు. కాళేశ్వరం మహా యజ్ఞానికి మకిలి పూసి కమిషన్ వేసిండ్రు. గతి తప్పిన ఇటువంటి పాలకుల మీద ప్రొటెస్టు చేయాల్సిన బాధ్యత మన మీద ఉన్నది. సకల జనులు సంఘటితమై నిలబడక పోతే మళ్లీ తెలంగాణ ఆగమైతది. ఇక్కడో కాల ధర్మాన్ని గుర్తు చేయాలి. అర్ధాష్టమ శని ప్రభావం రెండున్నర ఏండ్లే